# చిరుదీపం చెట్టంతనీడ

కోమలాదేవి



సెంట్రల్ బాంక్ అఫ్ ఇండియా —

బోర్డును క్రొత్తగా పెయింట్ చేశారు. పదిన్నర గంటల ఎండలో అది అందంగా ప్రత్యేకంగా కనబడుతోంది

ఆమె ఆ బోర్డువేపు కొన్ని క్షణాలు చూచి తలవంచుకుంది ఆమె కూర్చున్న రిక్షాకు అటు ఇటు రెండు సైకిల్స్ మీద ఇద్దరు మగవాళ్ళు, మరొక రిక్షాలో ఇద్దరు స్త్రీలు వచ్చారు. అందరు దిగి ఆమెను దిగమన్నారు. అదృశ్యమైన బరువేదో మోస్తున్నంత భారంగా దిగిందామె రిక్షాను ఆధారంచేసుకుని కొంచెం సేపు నుంచుంది. ఆ తరువాత కుంటి కుడి కాలును కదిపింది. ఆమెకు స చేయడానికి ఆ మిగతా ఆడవాళ్ళు దూరంగానే ఉండిపోయారు. మెల్లగా నడుస్తూ ఒక్కొ—మెట్టు ఎకి ఆ నలుగురు ఆమె వెనకాతలనే న్నారు. ఏ క్షణంలో పడిపో పట్టుకుందామని కాదుగాని వట మనసు మార్చుకుని వెనుదిరిగి వె అటంక పెట్టవచ్చునని వారి ఆ చూచేవారికి 'పాపం – పడిపోతే కుందామని కాబోలు' అని పి మానదు.

ఆమె ఆ నాల్గు మెట్లెక్కి—

షట్టర్‌ను పట్టుకుని నుంచుంది. ఆ రెండు పురుషకంఠాలు విసుగ్గా అన్నాయి, "ఇప్పటికే ఆలస్యమైపోయింది ... పద లోపలికి." ఒక్కసారి ఆమె కళ్ళెత్తి వారి కేసి చూచింది. వారి మాటల్లో మన్నింపు లేదు ఏడ్చిఏడ్చి ఎర్రగా ఉబ్బిన ఆ కళా విహీనమైన కళ్ళలో బాధను చూచి వారిద్దరు ముఖం తిప్పుకున్నారు. మగ వాళ్ళు మెత్తబడిపోయి కర్తవ్యవిమూఢు లైపోతారేమోనన్న భయం ఆ ఆడ వాళ్ళను రెచ్చగొట్టింది. గబుక్కున ఆమెకు అటొకరు ఇటొకరు జేరి "పదండి .. పదండి" అని తోసినంత పని చేశారు. ఆమె కదల్లేదు.

ఇద్దరి వైపు మార్చిమార్చి చూచింది. స్త్రీలో కనబడవలసిన నాజూకు, స్త్రీత్వ లక్షణాలేమీ వారిలో కనబడలేదు. అక్కడ చేరిన బాంక్‌పనివారు-మిగతా వారు వారిని చూస్తున్నారు. వారు చూస్తున్న దృశ్యం అసాధారణమైనది కాదు గాని, ఆమెలోని దీనత్వం, కుంటి తనం, తైల సంస్కారం లేని తల, నలుగురు వ్యక్తులు ఆమెను అంటిపెట్టు కున్న రీతి చూచి వారికి సంబంధించిన కథ తెలుసుకోవాలన్న ఉత్సుకత ప్రదర్శించారు.

ఆ స్త్రీలు ముఖాలు చిట్లించి ఆమె చెరొక రెక్క పుచ్చుకుని బలవంతంగా నడిపిస్తూ ఏజెంట్ రూంలోకి తీసు కెళ్ళారు. అక్కడున్న కుర్చీనీ చూడ గానే ఆమెకు ప్రాణం లేచివచ్చినట్లు గభాల్న అందులో కూలబడింది.

వాళ్ళు ఏజెంట్‌తో మాట్లాడు తున్నారు.

ఆమెకు అదేం వినిపించటం లేదు. కళ్ళలో కన్నీరు ఇంకిపోయింది. హృద యంలోని ఆవేదన ఛేధించుకుని బైటికి రావాలని ప్రయత్నిస్తూంటే ఆమె హృదయం ఎగసిపడ్తోంది. కళ్ళమీద చెంగు పెట్టుకుని కూర్చున్న ఆమె ఆ విధంగా ఎంతసేపు కూర్చున్నదో!

ఎవరో ఆమె వీపును తట్టి కుడిచేయి లాగుతున్నారు. ఆమె చేయి దించింది. ఆ చేతికి కలం అందిస్తున్నారు. కలం పట్టుకుంది. తన ఎదురుగా బల్లమీద కాగితాలు. ఏజెంట్ ఏదో చెబుతున్నాడు. ఆమెకు వినబడటం లేదు. ఆ కళ్ళలో కన్నీరు లేకపోయినా నలుపుతెర లేవో అడ్డంగా ఉన్నట్లు ఫీలయింది ఏదీ కని పించటం లేదు. ఎదుటి వ్యక్తికేసి తేరిపార చూస్తోంది.

"అమ్మా ఇక్కడ సంతకంచేయండి."

అతడు చూస్తూనే ఉన్నాడు. ఆమె చేతిలోని కలం జారి పడిపోయింది. తల టేబుల్‌కు కొట్టుకుని ముందుకు వాలి పోయింది. చిన్న అలజడి రేగింది. ప్యూన్ కూజాలోంచి నీళ్ళు ఒంపి అందించాడు. ఆమె ముఖం మీద జల్లారు. ఆమెకు స్మారకం వచ్చినా లేచి కూర్చోలేకపోయింది. తలను టేబుల్‌కు

అన్పి అలాగే నిస్త్రాణతో కూర్చుండి పోయింది.

ఆ నలుగురు విసుక్కున్నారు. క్రోధంతో త్రొక్కలాడారు. అందరు బాంక్ ఉద్యోగస్థులు-కష్టమర్లు"ఏమైంది? ఏమిటి?" అని ఒకరినొకరు అడుగుతున్నారు.

ప్యూన్ ఓ చిన్న విషయం చెప్పాడు. దానికి మరికొంత కలిపి ఎవరికి తోచినట్లు వారు కథలల్లుకుని చెప్పుకుంటున్నారు.

"ఆవిడ ఆస్తి రాయించుకోటానికి తీసుకొచ్చారు".

"ఆవిడ ఉంటున్న ఇల్లు తాకట్టు పెట్టాలని వచ్చారు."

ఈ రెండు కారణాలు వారికి అశ్చర్యాన్ని కల్గించలేదు. ఒకావిడ ఆమెను లేపి కుర్చీలో కూర్చుండబెట్టింది కాని ఆమెలో శక్తిలేనట్లు జేరబడిపోయింది.

"ఈమె ధాల బలహీనంగా ఉన్నట్లుంది. రెండు మూడు రోజులు ఆగి తీసుకొనిరండి. డాక్టర్‌కు చూపించండి."

పళ్ళు కొరుక్కుంటూ విసుగుతో క్రోధంతో అమెను ఇంటికి చేర్చారు. డాక్టర్‌కు చూపించారు అతడు ఇంజక్షన్ ఇచ్చి బాగా విశ్రాంతి ఇవ్వమని చెప్పి వెళ్ళిపోయాడు. ఆమె కొద్దిగా ఫలహారం తిని పాలుతాగి పడుకున్నది నిద్ర రావటం లేదు...ఆ నలుగురు మాట్లాడుకుంటున్నారు నలుగురు ఎక్కడో ఏనాడో. ఆ రోజు ఇల్లాగే మాట్లాడుకుంటున్నారు తను కాలునొప్పితో ఇల్లాగే నాపమీద పడుకునిఉంది ఆ రోజు ఏమైంది! తన తండ్రి స్నేహితులు ముగ్గురు మరొక స్త్రీ పద్మ విషయం మాట్లాడుకుంటున్నారు

* * *

"ఈ కాలు బాగవదంటున్నారు. ఆపరేషన్ చేయించాను. అయినా కుంటి పూర్తిగా పోలేదు అలాగే నడుస్తుంది. నన్ను ఈ రోగం పట్టుకుని వదలకుండా ఉంది అందుకే మిమ్మల్ని పిలిపించాను" పద్మ తండ్రి అంటున్నాడు. అతను ఎలిమెంటరీ స్కూలు టీచరు పద్మ తల్లి చిన్నతనంలోనే పోయింది. తండ్రి రత్నమయ్య టి.బితో బాధపడ్తున్నాడు. పద్మకు పదేళ్ళప్పుడు బండి క్రింద పడింది కాలు విరిగింది అది సరిగా అతకలేదు. అచోట ఎముక పెరిగి బాగా నొప్పిచేసింది. అపరేషన్ చేశారు కాని ఆమె కుంటి పద్మగానే ఉండిపోయింది.

రత్నమయ్య టిబితో కృశించి పోతున్నాడు. కూతురి కాలుకోసం ఉన్న కొంచెం డబ్బు ఖర్చుపెట్టాడు. తన మందుకు ఏమీ మిగల్లేదు. పనిపోయింది. తను అవసానదశలో ఉన్నాడని తెలుసుకుని స్నేహితులను పిలిపించాడు. అందరు జాలి దలచారు. ఇద్దరు తమ నిస్సహాయతను తెలియజేశారు కాని ముకుందరావు మాత్రం అభయహస్తం చూపాడు. "పద్మ బాధ్యత నేను వహిస్తాను. నువ్వు నిశ్చింతగా ఉండు.

ఇంతలో ఏదైనా సంబంధం చూస్తాగా. పెళ్ళి చేసి పంపుదాం. స్నేహితుడిగా ఈమాత్రం చేయగలను."

రత్నమయ్య స్నేహితుడి చేయిపట్టుకుని పసిపిల్లవాడిలా ఏడ్చాడు. ఎంతో కృతజ్ఞతతో స్నేహితులను సాగనంపాడు.

ఇంట్లో ఉన్నదంతా అమ్మేస్తూ మరి రెండు నెలలు ఎలాగో గడిపారు. ఒకరోజు తండ్రికి చాల సీరియస్‌గా అయింది. వెంటనే ముకుందరావుకు టెలిగ్రాం ఇచ్చారు. కూతురికి ఆశ్రయం దొరికిందన్న తృప్తితో-ముకుందరావును చూచిన వెంటనే అతడు ప్రాణం విడిచాడు.

అప్పటికి పద్మకు పదిహేను సంవత్సరాలు నిండాయి. ఒక పాత ట్రంకు, చిన్న గోనెసంచులతోపాటు పద్మను ఇంటికి తీసుకొచ్చాడు. ముకుందరావు భార్య సూరమ్మ ఆ వచ్చిన వ్యక్తిని చూచి ప్రథమ వీక్షణంలోనే అసహ్యించుకున్నది.

వయసులో ఉన్న ఆడపిల్ల. అందగత్తె కాకపోయినా మాట్టానికి బాగానే ఉన్న పిల్ల. దానికి తోడు కుంటిది. ఈ పిల్లను తెచ్చిన భర్తను పరిపరివిధాల తిట్టుకుంది. పద్మ తొమ్మిది చదువుకున్నది. పది పుస్తకాలు తెప్పించి ప్రైవేట్‌గా మెట్రిక్ కట్టించాడు. తీరిక సమయాల్లో ఆ పిల్ల మౌనంగా సూరమ్మకు అన్ని పనుల్లో సహాయం చేసేది. క్రమేణ ఆమెకు ఆ పిల్లపట్ల ఉన్న క్రోధం తగ్గిపోయింది. అలా అని ఆ పిల్లను ప్రేమగా చూచుకొనేది కాదు.

సెలవలికి యిద్దరు కొడుకులు ఇంటికొచ్చారు. సాధ్యమైనంత వరకు సూరమ్మ, ముకుందరావులు పద్మను వారిద్దరినించి దూరంగా ఉంచేవారు.

పద్మ ముకుందరావును మామయ్యా అనేదిగాని ఆమెను మాత్రం అమ్మగారూ అని పిల్చేది. అలా పిలవమని మొట్టమొదటి రోజున ఆజ్ఞ జారీచేసింది. ఇరుగుపొరుగువారు కుంటిపిల్లను గూర్చి రకరకాలుగా మాట్లాడుకుని అలసిపోయి మర్చిపోయారు. ఆ పిల్ల ఆ వీధివాళ్ళకు అలవాటయిపోయింది.

పద్మ కుంటుకుంటూ వెళ్ళి టైప్ నేర్చుకుంది. ఉషా క్లాసులకు వెళ్ళి బట్టలు కుట్టటం నేర్చుకుంది. ముకుందరావు మెషీన్ కొనిపెట్టాడు.

ఆమెకు ఇరవై సంవత్సరాలు నిండేసరికి ఆ గృహంలో జరిగిన మార్పులు మూడు. కొడుకు లిద్దరికీ పెళ్ళయిపోయి ఉద్యోగరీత్యా హైద్రాబాద్‌కు వెళ్ళిపోవటం, ముకుందరావు షష్ఠిపూర్తి చేసుకోవటం, సూరమ్మకు బ్లడ్‌ప్రెషర్ రావటం.

ముకుందరావు పద్మకు పెళ్ళిచేయాలని ఎంతో ప్రయత్నిస్తున్నాడు. ఆ పిల్ల కుంటిదని ఒక్కటీ కుదరలేదు. ఏ

రెండో మూడో సంబంధానికి చేద్దామన్నా ఏదీ రాలేదు. ఇంతలో ఆమె పాదం మీద తెల్ల మచ్చ కనబడటంతో ఆయన పెళ్ళి ప్రయత్నం పూర్తిగా మానేశాడు.

పద్మకు బోధపర్చాడు. "పద్మా! ఈ కుట్టుపనితో నీ కాళ్ళమీద నీవు నిలబడ గలవు. విన్నొక ఇంటిదానిగ చేయాలని ఎంతో ప్రయత్నించాను. ఆ విషయం నీకు కూడ తెలుసును. కాని ప్రస్తుత పరిస్థితుల్లో నీ పెళ్ళి అవటం చాలా కష్టం. అందుకే నీవు ఇక్కడే ఉండి టైలరింగ్ చేస్తూ కాలం గడుపు. కొంత బాంక్‌లో వేసుకో. ఇంతకన్నా నేనేం చెప్పగలను!"

పద్మ మామయ్యకు ధైర్యం చెప్పింది. "ఫరవాలేదు. నా విషయం మీరేం బెంగ పెట్టుకోకండి ఈ మాత్రం ఆశ్రయం నాకుంది. నాకేం భయంలేదు." ముకుంద రావు ఆనాటినించి పద్మ విషయమై ఉన్న ఆందోళననుంచి విముక్తి పొందాడు. సూరమ్మ చిన్న చిన్న పనులు చేస్తుంది. దాదాపు ఇంటి భారమంతా పద్మపై బడింది. పండుగలంటూ కొడుకులు కోడండ్రు పిల్లలు వచ్చినా పద్మ అన్నీ చూచుకోగల్గుతోంది. పిండివంటలు, బజారుకెళ్ళి గుడ్డలు తేవటం అన్నీ ఆమె చేతిమీదుగా జరిగిపోతున్నవి. పిల్లైనప్పుడంతా బట్టలుకుట్టి వచ్చిన డబ్బు పాతిక అవగానే కావలసిన గుడ్డలు కొనుక్కుంటుంది.

పద్మ ఆ ఇంట్లో అంత స్వతంత్రంగా తిరగటం ముకుందరావుకు తప్ప మిగతా వారి కెవ్వరికీ ఇష్టంలేదు. సూరమ్మకు అసలు ఇష్టంలేదుగాని తప్పదు

బజారునించి వచ్చి "అమ్మగారూ! ఈ చీరలు, ఈ గుడ్డలు అన్నీ ఏడు వందల చిల్లర అయింది బిల్లు ఇదిగోండి. ఒక్కొక్క చీర, షర్టు గుడ్డలు, ధోవతులు చూస్తూ ఆమె సంతోషంతో మంచంమీద వేరువేరుగా పెట్టింది. ఆ గుడ్డల్లో పద్మకు ఏమీలేవు. "నువ్వెందుకు కొనుక్కోలేదు!" అని ఆమె పద్మను అడగలేదు. పండుగ రోజున, పద్మ ఒక్కత్తి పాతచీరతోనే గడిపింది. అది ఎంతో సహజంగా వుంది. "పాపం పద్మ" అనుకున్నది ఒక్క మామయ్య మాత్రమే.

అందరు వెళ్ళిపోయిన తర్వాత భార్య దగ్గర కూర్చుని పద్మతో అన్నాడు "ఏమ్మా పద్మా. దుకాణంవాడికి చెప్పాను నాల్గు చీరలవి. నువ్వు సెలెక్ట్ చేసు కొంటావని చెప్పాను. మూడే కొన్నావు. నీకోసం తెచ్చుకోలేదేమమ్మా!" అని

పద్మ సంతృప్తిగా చూచింది. "ఇంకొక్క పదిరూపాయిలు జేరితే ఏభై అవుతాయి. అప్పుడు కొనుక్కుంటాను మామయ్యా. ఈ ఇంటి భద్రతమీ అండ చాలు నాకు."

"చూచావా? ఎంత బుద్ధిమంతురాలో!" అన్నాడు భార్యతో. అప్పటినించి సూరమ్మ

తట స్థంగా ఉండడం మానివేసి కొత్త ప్రేమతో మాట్లాడటం నేర్చుకుంది. ఆమెలో అంచెలంచెలుగా వస్తోన్న మార్పుకు పద్మ ఎంతో సంతోషించింది.

రోజులు గడస్తోన్న కొలది సూరమ్మ ఆరోగ్యం దిగజారిపోయింది. ఆమె పద్మమీద ఆధారపడటం ఎక్కువై పోయింది పద్మ కుట్టుపని తగ్గించి వేసింది. మామయ్యను, అమ్మగార్ని చూచుకోవటంతో సరిపోతున్నది

ఆమెకు సుస్తీగా ఉన్నదని-కులాసాగా లేదన్న ఖబురందగానే కొడుకులు కుటుంబాలతో సహా వచ్చి వారం రెండు వారాలుండి వెళ్ళిపోతున్నారు.

తల్లి మంచంమీదనే ఉండటం-పెత్తనమంతా పద్మదే అవటం వారికి భరింపరానిదిగా ఉంది.

కోడళ్ళు రాగానే పద్మ వంటిల్లు ఒదిలి ఆమె దగ్గరకు వెళ్ళేదికాదు. అత్త గార్కి ఏ పరిచర్య చెయ్యవలసివచ్చినా కోడళ్ళు వెంటనే పద్మను పిల్చేవారు. మొదటిమాటు ఆమె అంతగా పట్టించు కోలేదు గాని-తరువాత - ఆ తరువాత వాళ్ళు తనకేం సేవచేయటంలేదని-పద్మ లేకపోతే తన గతి ఏమయ్యేది అన్న ఆలోచన రాకపోలేదు కోడళ్ళు చుట్టపు చూపుగా వచ్చి వెళ్ళటం ఆమెకు బాధగా ఉంది ఓ మారు ఆ మాట పైకి అనేసింది.

"అమ్మగారూ - ఫరవాలేదు. నేను ఉన్నానన్న ధైర్యంతో వాళ్ళు పట్టనట్లు ఊరకున్నారు. కాని అవసరం వస్తే వాళ్ళు చేయకపోతారా?" అంది

అప్పటికి ఆమె మౌనం దాల్చింది. పద్మ జవాబుకు ముకుందరావు ఎంతో ఆశ్చర్యపోయాడు. పద్మ మాటల్లో ఎంత యథార్థత ఉన్నదో తెలుసు కోవాలి-భార్య కూడా తెలుసుకోవాలన్న కాంక్షతో దసరా సెలవులకు కొడుకులు వస్తున్న సమయంలో పద్మను తనకు తెలిసిన టీచరు ఇంటికి పంపేశాడు.

"ఎందుకు పంపారు?" అని సూరమ్మ అడిగింది. "ఈ బండికి కొడుకులు వస్తున్నారు వాస చూచుకుంటారులే. పద్మను పంపమని ఆవిడ అడిగింది. వారింట్లో ఏదో శుభకార్యం ఉందట. సహాయానికి రమ్మంటే పిలవవదని చెప్పలేకపోయాను" అన్నాడు.

సాయంత్రం ఏడుగంటలకు అంతా వచ్చారు. ఐదుగురు మనవళ్ళు మనమ రాళ్ళు దిగగానే ఇల్లంతా సందడిగా ఉంది కుశల ప్రశ్నలు వేసుకున్నారు. తల్లికి చెరొకప్రక్క కొడుకులు కూర్చుని ఖబుర్లు చెబుతున్నారు. లోపలికి వెళ్ళిన కోడండ్రు ముఖాలు కడుక్కుని వచ్చారు.

"పద్మ ఎక్కడికి వెళ్ళిందండీ?" అని సూరమ్మనడిగారు.

ఆమె చెప్పింది. "మీరంతా వస్తున్నా రని వాళ్ళటీచరుగారు సాయానికి తీసు

కెళ్ళారు. మీరు ఉన్నంత వరకు అక్కడే ఉండమన్నారు పద్మని..."

కోడళ్ళిద్దరూ విసుగ్గా వెళ్ళటం ఆమె గమనించలేదు. సెలవలకు పుట్టింటి కెళ్ళినట్లు వచ్చి హాయిగా గడిపి వెళ్ళిపోయే వారిద్దరిని పద్మ లేదనగానే కోపం, విసుగు చుట్టుముట్టాయి.

వంట వడ్డించేసరికి పదిన్నర అయింది. మొదట అత్తగారికి పెట్టాలన్న ఆలోచనకూడా రాలేదు.

"మీ అమ్మకు మొదట పెట్టండి. ఇంకా ఆలస్యమైతే అరగదు." తండ్రి హెచ్చరింపుకు ఒక కొడుకు తల్లికి భోజనం పట్టుకెళ్ళాడు. చేయి కడిగించి అన్నీ చూచుకుని వంటింట్లో కెళ్లాడు.

"ఏ వస్తు వెక్కడుందో చూచుకుని వండేసరికి ఆలశ్యమైంది...." అని చెప్పుకున్నారు.

"ఫరవాలేదు. ఏ వస్తు వెక్కడుందో తెలిసిపోయిందిగా? రేపటినించి త్వరగా వంటచేయండి. మీ అత్తకు పెందలాడే పెట్టాలి."

అలసిపోయారేమో! అందరు ఆద మరచి నిద్రపోతున్నారు. తల్లి దగ్గర ఎవరైనా పడుకోవాలన్న ఆలోచన ఒక్కరికి రాలేదు. రాత్రుళ్ళు ఆమె లేచినప్పుడంతా ముకుందరావే లేచి సహాయం చేశాడు. రెండవరోజు ఆయన చెప్పాడు "ఎవరైనా మీ అమ్మ దగ్గర పడుకోండి" అని.

పది రోజులని వచ్చినవాడు నాలుగవ రోజున అర్జంట్ పనులున్నాయి వెళ్ళి పోవాలన్నారు. తల్లి ఉండలేక అంది "పదిరోజులని పండుగ అయిన వెంటనే వెళ్తామంటున్నారేం... ఉండండి... మళ్ళీ ఎప్పటికి చూస్తాను"

"నీకేం అమ్మా....బాగానేఉంటావు... నీకేం భయంలేదు. మళ్ళీ వస్తాంగా? పనులున్నాయి. వెళ్ళాలి." ముకుందరావు ఈ ఏడాది వారికోసం కొత్త బట్టలు సిద్ధంచేయలేదు. కొడుకులకు చెప్పి చూశాడు కాని వాళ్ళు ఉండటానికి వీల్లే దన్నారు. వచ్చిన ఐదవరోజు వెళ్ళి పోయారు.

రిక్షాలు అటు కదిలాయి. ముకుంద రావు తలుపువేసి భార్య దగ్గర కొచ్చాడు. ఆమె కన్నీళ్ళు తుడుస్తూ ఓదార్చాడు.

"అది కాదండీ. పూర్తి సెలవులు ఇక్కడ గడపకుండా వెళ్ళిపోయారు. పోనీ ఒక్కమారైన మనల్ని రమ్మన లేదు." ఆమెకు తగురీతి సమాధానం చెప్పి ఓదార్చాడాయన.

"వాళ్ళకు ఇవన్నీ అలవాటు లేదు. అందుకే వెళ్ళిపోయారు."

"వెళ్ళి పద్మను పిల్చుకురండి." అంది.

"రేపు వెళ్తానులే. ఎవి మిది కావస్తోంది" అన్నాడు. వాళ్ళిద్దరూ కొడుకుల విషయం మాట్లాడుకుంటూనే ఉన్నారు. తలుపు చప్పుడైంది.

ఆయన తలుపు తీశాడు - చేతిలో సంచితో పద్మ నుంచుని ఉంది.

"పద్మా... వచ్చేశావా అమ్మా" అన్నా రాయన ఆప్యాయంగా.

గబగబ లోపలికి వెళ్తూ అంది "టీచర్‌గారి చిన్నకొడుకు రిక్షాల్లో అంతా వెళ్ళిపోవటం చూశాడట-వచ్చిచెప్పాడు. వెంటనే వచ్చేశాను."

కాళ్ళు కడుక్కొని ప్లేటులో ఫలహారం పెట్టుకుని సూరమ్మ దగ్గరి కెళ్ళింది.

పద్మను చూడగానే ఆమెకు ఎక్కడ లేని హుషారు పుట్టింది. అక్కడి ఖబుర్లన్నీ అడిగి తెలుసుకుంది. ఆ తరువాత వాళ్ళంతా వెళ్ళిపోయినందుకు ఎంతో బాధపడిపోతూ పద్మకు చెప్పింది.

"అమ్మగారూ! ప్రథమంనించి వారికి నేనిక్కడ మీ పంచను ఉండి నా జీవితాన్ని వెళ్ళబోస్తున్నానని తెలుసును. మీ ఇద్దరికి తోడుగా నే-నున్నాననీ, మీ అవసరాలు నేను చూస్తున్నానన్న తృప్తి వారికున్నది. అందుకే ఒక్కసారి మీ భారాన్ని వారు వహించలేకపోయారు. పోనీ ఒకసారి మీరిద్దరూ వెళ్ళిరాకూడదా? వారికి మీరు అలవాటు కావాలి".

నవంబర్ మాసంలో మంచిరోజు చూచి భార్యాభర్తలు హైద్రాబాద్ వెళ్ళారు. పద్మ రాత్రుళ్ళు టీచరు గారింట్లో పడుకునేట్లు, పగలు ఇల్లు కనిపెట్టుకుని ఉండేట్లు ఏర్పాటు చేశారు.

నెల రోజులకని వెళ్లినవారు వారంలో తిరిగి వచ్చేశారు. ఎందుకు వచ్చేశారో ఆమె ఊహించుకున్నా పైకి ఏమీ అడగ లేదు వారు చెప్పలేదు.

ఎప్పటిలాగానే ఉగాదికి రమ్మని వ్రాయదల్చుకోలేదు ముకుందరావు. కాని పద్మ ఒప్పుకోలేదు. "అమ్మగారూ - రమ్మని వ్రాయండి. నేనున్నానుగా. మీకు అన్నీ అమర్చి వాళ్ళను కూడా చూచుకోగలను. వారంతా వచ్చివెళ్తే మీకు సంతోషంగా ఉంటుంది. లేకపోతే వాళ్ళు మరీ దూరంగా ఉండి పోతారు. మీరు సంతోషంగా ఉండాలి. ఇలా బెంగపెట్టుకుని దిగులుగా ఉంటే మీ ఆరోగ్యం పాడవుతుంది. వాళ్ళను మీరు పిలిపించకపోతే లోకం మొదట నన్ను తూలనాడుతుంది."

తప్పక రమ్మని తల్లిదండ్రి వ్రాయటంతో బయలుదేరి వచ్చారు. కాని అందరు తెచ్చికోలు ఆనందాన్ని ప్రదర్శిస్తూ ఆ నాలుగు రోజులు గడిపి వెళ్ళిపోయారు.

అప్పటినించి సూరమ్మ ఆరోగ్యం క్రమేణ పాడవుతూ వచ్చింది. మధుమేహం - బ్లడ్‌ప్రెజర్‌తో ఆమె బాధ పడ్తూ ఉంది. ఇంటి బాధ్యత డబ్బుతో సహా పద్మ అధీనంలోకి వచ్చింది.

సూరమ్మ అరవై మూడవ ఏట చని పోయింది.

అందరు వచ్చి వెళ్ళిపోయిన



తరువాత ముకుందరావు, పద్మ మిగిలిపోయారు

సూరమ్మ చనిపోయిన తరువాత దాదాపు పనిలేనట్లే ఉంది పద్మకు. మళ్ళీ కుట్టుపని మొదలుపెట్టింది

సగం ఇల్లు అద్దెకిచ్చాడు ముకుందరావు.

నిర్విరామంగా రోజులు గడిచిపోతున్నాయి పద్మ భవిష్యత్తును గూర్చి రోజుకు కనీసం ఒక్కసారైన ముకుందరావు విచారించకపోలేదు

స్నేహితులు, ఇరుగుపొరుగువారు వస్తే అనేవాడు

“నా స్నేహితుడికి ఇచ్చిన మాట

నిలబెట్టుకోలేకపోయాను. పద్మకు పెళ్ళి చేయలేకపోయాను."

"ఏం చెయ్యగలదు? ఆమె కుంటిది - పైగా ఆ మచ్చలు. అన్నీ సలక్షణంగా ఉంటేనే పెళ్ళికాని ఈ రోజుల్లో ఈ అవలక్షణాలుంటే ఎలా అవుతుందనుకున్నారు? ఏదో పని నేర్పించారు. ఆమె తన్ను తాను పోషించుకోగలదు" అని బోధపర్చేవారు.

ముకుందరావు ఆరోగ్యం బాగానే ఉంది. అందుకని అప్పుడప్పుడు కొడుకుల దగ్గరకెళ్ళి వస్తూఉండేవాడు.

కాలప్రవాహంలో పది సంవత్సరాలు కొట్టుకుపోయాయి.

ఉన్నట్లుండి ఒకరోజు ముకుందరావు కళ్ళుతిరిగి పడిపోయాడు. అతడికి హార్ట్ ఎటాక్ వచ్చింది.

ఇరుగుపొరుగువారి సహాయంతో అతణ్ని హాస్పిటలుకు తీసుకుని వెళ్ళింది. గండం గడిచింది. పదిహేను రోజులు పెట్టుకుని ఇంటికి పంపించారు.

కంటికి రెప్పలా చూచుకుంటున్న పద్మను చూస్తుంటే అతడి హృదయం తరుక్కుపోతోంది. పదిహేనేళ్ళ పిల్లగా తీసుకుని వచ్చినప్పటినించి పద్మ తమకు సేవచేస్తూనే ఉంది. ఇరవై మూడేళ్ళు గడిచిపోయాయి ఆమె లేక పోతే తన గతి ఏమయ్యేది? కొడుకుల దగ్గర "ఎటి" ఉండవలసి వచ్చేది. ఆ ఇళ్ళలో తనకు సుఖం ఎక్కడ ఉంటుంది? సూరమ్మ కూడా పద్మవలన ఎంతో సుఖాన్ని పొందింది. తల్లిదండ్రులకు సేవచేసినట్లుగా భావిస్తోంది. ఈమెకు తను ఏంచెయ్యగలడు?

తండ్రికి సుస్తీచేసిందని వినగానే కొడుకులిద్దరూ బయలుదేరి వచ్చారు ఒకరోజు తండ్రి బాగోగులు చూచారు. రెండవరోజు డబ్బు అడిగారు. పెద్ద కొడుకు తన కూతురికి పెళ్ళిచేయాలని డబ్బు కావాలని అడిగాడు దానికి ముకుందరావుకు చాల కష్టం వేసింది. తన నిస్సహాయతను తెలియచేస్తూ అన్నాడు, "మీకు ఉద్యోగాలై హైదరాబాదుకు వెళ్ళిన తరువాత నాకు ఒక్క చిల్లికాని పంపలేదురా మీరు. పండుగలకని వచ్చినప్పుడు కూడ మీరు ఒక్క కాని ఖర్చు పెట్టలేదు మీకు అన్నీ అమర్చి పంపే వాళ్ళం. ఏ ఒక్క విషయంలో లోటు చేయలేదు. మీ అమ్మకు మందులకని బలానికని ఎంతో ఖర్చుపెట్టాను. అలాగే ఇప్పుడూను పదిహేను రోజులకు ఐదు వందలకు పైగా అయింది. పెన్షన్ తీసుకుని ఇరవై మూడేళ్ళు గడిచి పోయింది. పై ఆదాయం లేదు. కేవలం నూటపాతిక రూపాయలు పెన్షన్ వస్తుంది. ఇంటి అద్దె ఇదీ కలిపి కటా కటీగా సరిపోతున్నది"

"మీరు చెప్పేది కరెక్టే నాన్నగారూ - కాని ఒక కేసులో ఇరుక్కున్నాను.

ప్లీడర్‌కు చాల డబ్బు ఇవ్వాల్సివస్తోంది" పెద్దకొడుకన్నాడు.

"పోనీ ఈ ఇల్లు ఏదైనా బాంక్‌లో తాకట్టుపెట్టి అన్నయ్యకు డబ్బు సర్దండి. ఆ తరువాత తీర్చుకుంటాడు."

"ఒద్దు ఏవో లోన్లు మీరె తీసుకోండి. ఈ ఇంటిని తాకట్టుపెట్టడం నా కిష్టం లేదు."

కొడుకులు రెండురోజులాగి వెళ్ళి పోయారు.

తండ్రికి డెబ్బై ఎనిమిది సంవత్స రాలు ఐనా ఇంకా ఎంతో కాలం బ్రతికేట్లు మాట్లాడుతున్నాడు! అనుకుని నొచ్చుకున్నారు. నిజమే.. సిటీలో ఉంటూ ఇంతవరకు తలిదండ్రులకు ఏమీ పంపలేదు. కాని నాన్నఅన్నట్లు డబ్బంతా ఖర్చయిపోయి ఉంటుందా?

అంతే కాదు, వారిని మరో భయం పట్టుకుంది.

పద్మకోసం ఎంత డబ్బు దాచి ఉంచాడు!

ఇన్ని సంవత్సరాలు సేవచేసినందుకు ఆమెకు ఏమియిస్తాడు! రోజులు సాఫీగా గడిచిపోతున్నాయి.

ముకుందరావు మెల్లగా కోలు కున్నాడు. పద్మ అతణ్ణి అతిజాగ్రత్తగా చూసుకుంటోంది. కావలసిన మందులు క్రమం తప్పకుండా యిస్తోంది మరో ఆరు మాసాలకు అతడు పూర్తిగా కోలు కున్నాడు. కాని డాక్టర్ల హెచ్చరికను ఆమె జ్ఞాపకం పెట్టుకుంది. మళ్ళీ ఎటాక్ రావచ్చునని.

అతడికి రెండేళ్ళ తరువాత మైల్డ్ ఎటాక్ వచ్చింది. దాదాపు నెలరోజులు హాస్పిటల్‌లోనే ఉన్నాడు పద్మ తన దగ్గర ఉన్న డబ్బు ట్రీట్‌మెంట్ కోసం ఖర్చు చేసింది "ఎందుకమ్మా—ఇంత ఖర్చు పెడ్తున్నావు?"అంటే "మామయ్యా మీరు తప్ప నాకీలోకంలో ఎవరున్నారు?" అని కన్నీళ్ళు పెట్టుకునేది.

అందుకని ముకుందరావు కూడ స్వాస్థ్యం పొందాలని ఆమెకోసం జీవిం చాలన్న కాంక్ష ఉండటంచేత మెల్లగా కోలుకున్నాడు.

అతడి పెద్దకొడుకు కూతురి పెళ్ళ యింది. వెళ్ళలేకపోయాడు. కాని వధూ వరులు తాతగారి దగ్గరకు వచ్చినప్పుడు ఆయన సూరమ్మ గాజుల జత ఇచ్చి పంపాడు ఆ తరువాత ఆయన తన దగ్గరున్న రొక్కం, నగలు, వెండి, పాత్ర ఇతర సామాను ఎంత ఉన్నదో చూచుకున్నాడు.

ఆ తరువాత ఒక తీర్మానానికి వచ్చాడు. టీచర్‌గారిని, ఆమె భర్తను, తన స్నేహితుని కొడుకు కృష్ణను పిలి పించాడు తలుపు మూసుకుని రెండు గంటలు వారితో ఏదో మాట్లాడాడు. వాళ్ళు ఇంకా మాట్లాడుతున్నట్లే ఉంది

* * *

ఎవరో తట్టిలేపారు. మగతగా కళ్ళు తెరచింది. అరవై ఏళ్ళు పైబడ్డ టీచర్ గారు పక్కలో కూర్చుంది.

"పద్మా. లేమ్మా. ఈ మందు త్రాగు"అని మందు, పళ్ళరసం ఇచ్చింది. మెల్లగా లేచి కూర్చుని చుట్టూ చూచింది. ఆ ముగ్గురు-అంటే టీచర్ గారు - ఆమె భర్త ముకుందరావు, స్నేహితుని కొడుకు కృష్ణ అక్కడికి ఎప్పుడు వచ్చారో! మాట్లాడుకుంటున్నారు.

వారిని చూడగానే తను అప్తులమధ్య ఉన్నట్లు భావించింది. ధైర్యం తెచ్చుకుంది మందు - పళ్ళరసం తీసుకుని గోడకు చేరబడి కూర్చుంది.

ఇక తేలిపోతుంది తనకు ఆ ఇంట్లో ఎటువంటి స్థానం ఉందో తేలిపోతుంది. తనకు మాయమాటలు చెప్పి బాంక్ కు గాని, మరెక్కడికి గాని తీసుకెళ్ళి తన చేత ఏ పత్రంమీద సంతకం చేయించలేరు.

తను చూస్తూ ఉండగానే బిందెలు పాత్రసామాను కొడుకులిద్దరు భాగాలు వేసుకుంటున్నారు. అంత నీరసంలోను పద్మ పేలవంగా నవ్వుకుంది 'అందుకే మామయ్య తనకోసం అన్ని ఏర్పాట్లు చేసి ఉ.' అనుకుంది. కళ్లు జలాశయాలే అయ్యాయి. హృదయంలోంచి దుఃఖం ఉప్పెనలా వచ్చింది భోరున ఏడ్చింది. టీచరుగారు ఓదార్పుగా ఆమె భుజాన్ని తడ్తూ కూర్చుంది.

స్నేహితుడి కొడుకు కృష్ణ అడిగాడు- "మరి పద్మగారి విషయం ఏమిటి తేల్చారు?"

"ఏమో! నాన్నగారు ఆమెకు ఏదో ఇచ్చే ఉంటారు. మేము తేల్చవలసింది దేదీలేదు. మేము వెళ్ళిపోతున్నాము"

"ఇందాక బాంక్ కు తీసుకెళ్ళారట" టీచరుగారు కదిపింది.

"ఆ" అంటూ నసిగారే గాని వివరాలు చెప్పలేదు.

అన్నదమ్ము లిద్దరూ చిన్న గృహ పరిశ్రమ పెట్టటానికి బాంక్ లో అప్పు తీసుకోవాలనుకున్నారు దానికి మరొకరి సంతకం కావాలి. ఆ వ్యక్తి వారి తరపున వకల్తా పుచ్చుకోవాలి. ఆ వ్యక్తి కడ కనీసం పదివేల రూపాయలు గాని- అంత ఖరీదుచేసే ఆస్తిగాని ఉండాలి. తల్లి నగలలో జతగాజులుతప్ప మిగిలినవి లేకపోవటంతో తప్పక అవి పద్మ దగ్గర ఉంటాయని ఆమెను ఈ విధంగా ఇరికిస్తే ఒకనాడు ఆ అప్పు తీర్చే భారం ఆమెపై బడ్తుందని-ఆ విధంగా తాము లాభం పొందవచ్చునని కుయుక్తితో ఆమెను బాంక్ కు తీసుకుని వెళ్ళారు. కాని పని జరుగలేదు. ఇంకా వ్యవధి ఉంది. రెండురోజు లాగి ఆమెను మళ్ళీ తీసికెళ్ళాలి ఈమాటు ఆమె సంతకం చేసేలా చూడాలి అంత సులభంగా ఆమెను ఒదలరు

"మీ నాన్నగారు విల్లు రాసిఉండాలనుకుంటాను." టీచరుగారి భర్త అడిగారు

"రాశారు. ప్లీడర్ గారు ఊళ్ళో లేరు. ఈ ఉదయం బండికి వచ్చారు. వెంటనే రమ్మని ఖబురుచేసి వచ్చాను," అన్నాడు కృష్ణ.

ఇంట్లో ఉన్న ప్రతి వస్తువును కదిలించి చూస్తున్నారు. పంచుకుంటున్నారు.

"మూడు భాగాలు వేయండి. పద్మను ఒదిలేస్తే ఎలా?" టీచరమ్మ అందిగాని వారు నిరసనగా చూచారేగాని మారు మాట్లాడలేదు.

ఇంతలో ప్లీడర్‌గారు వచ్చి అందరికీ తన సంతాపం తెల్పి పద్మ దగ్గర కాస్త వేదాంతం మాట్లాడి సీలుచేసిన కవరు విప్పాడు

"ఇది మీ నాన్నాగారి విల్లు. రిజిస్టర్ కూడా అయింది. మీ నాన్నగారికి మిగిలిన ఆస్తి ఈ ఇల్లు - దీని చుట్టూ ఉన్న చిన్న కాంపౌండు."

అంతా ఉత్సుకతతో చూస్తున్నారు. పద్మ ఒక్కత్తి అలా కళ్ళుమూసుకుని కూర్చుని ఉంది. అందులో ఏమున్నదో! అన్న ఆత్రం ఆమెలో లేదు. తనకోసం మామయ్య ఏదో ఏర్పాటుచేసే ఉంటాడు. అది ఎంతైనా చాలును.

ప్లీడర్ ప్రారంభించాడు .. 1973 .. అంటూ ప్రారంభించిన ఆ విల్లు మొదటి నాలుగు లైన్లు వీలునామా పరిభాషలో నడిచింది . తరువాత "సగం ఇల్లు అనగా తూర్పు దిశను ఉన్న రెండు గదులు - పెద్ద హాలు - వంటఇల్లు - ఈ గదుల ప్రక్కలో ఉన్న ఖాళీ స్థలం - ఆ స్థలంలో ఉన్న కొళాయి, కొళాయి ప్రక్కన ఉన్న మూడు కొబ్బరిచెట్లు నా అర్ధాంగి అయిన శ్రీమతి పద్మకు..."

"ఏమిటీ? " అని ఒక్కసారి ఆడ మగ నాల్గుకంఠాలు ఖంగుమన్నాయి!

"సరిగా చదువుతున్నారా?" ఒకరు అన్నారు క్రోధారుణనేత్రాలను పద్మ మీద కేంద్రీకరించి.

"ఆ . నా అర్ధాంగి అయిన శ్రీమతి పద్మకు ."

ప్లీడర్ ఆపుజేశాడు. వాళ్ళు నలుగురూ ఒకరి ముఖాలొకరు చూచుకుంటున్నారు వారి ముఖాల్లో కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు అవతలి భాగంలో ఏముంది? మరో రెండు గదులు వంట యిల్లు. చిన్న ఖాళీస్థలం. కొళాయి లేదు. అద్దెకిస్తే ఎనభైకన్నా ఎక్కువ రాదు!

పెద్దకోడలు నిరసనగా అంది. "ఆ ముసలాడికి పెళ్ళాం కావలసివచ్చిందా?"

టీచర్‌గారు నవ్వారు .... ఆ నవ్వు అర్థంచెప్పుకోలేకపోయారు

"అసలు నిజమేనా? పెళ్ళాం అంటే సరా - ఋజువేదీ?"

ప్లీడర్ వారి చేతికి ఒక కాగితం అందించాడు.

అది పెళ్ళి సర్టిఫికెట్. 1965లో ముకుందరావుకు రెండవసారి హార్ట్‌ఎటాక్ వచ్చిన తరువాత, టీచరు, ఆమె భర్త కృష్ణ సమక్షంలో పెళ్ళి అయినట్లుంది.

కృష్ణ మాట్లాడాడు "పద్మగారు మీ అమ్మగారికి మీకు ఎంతో సేవ చేశారు. ఆ తరువాత ముకుందరావుగార్ని కంటికి రెప్పలా కాపాడుకున్నారు ఆమెకు వారి తదనంతరం ఏ విధమైన ఆర్థిక ఇబ్బందులు కలగకూడదని - ఏ విధంగా

జేస్తే ఆమె భవిష్యత్తులో బాధపడకుండా ఉంటుందనీ ఆలోచించి ఒకనాడు మా ముగ్గుర్నీ పిలిపించారు స్వార్థంకోసం-ఆనందంకోసం తను ఈ పని తలపెట్టడం లేదని-పద్మ తన భార్యగా ఉంటేనే ఆమెకు ఎవ్వరు కీడు తలపెట్టలేరని-దావా వేయలేరని - తన భార్యగా ఆమె కొన్ని హక్కులను పొందగలవనీ తన తదనంతరం ఆమె జీవితంలో తిండికి, బట్టకు లోటులేకుండా గడిచిపోవాలని, అందుకే అంత వృద్ధాప్యంలో ఉన్న తను ఆమెకు కేవలం తనపేరు ఇవ్వటానికే ఈ విధంగా జేస్తున్నట్లు తెలియజేసి మా సలహా అడిగారు. మేము చాలసేపు అన్ని కోణాల్లోనించి ఆలోచించి చివరికి పద్మగార్ని అడిగాము. ఆమె ఆమాట విని మొదట నమ్మలేదు ఆ తరువాత వివరాలు అడిగింది

* * *

మళ్ళీ ఇన్ని సంవత్సరాలనంతరం। పద్మకు ఆ రోజు బాగా జ్ఞాపకం.

"అమ్మా పద్మా-ఈ ఏర్పాటు కాగితానికి పరిమితి అయిఉంటుంది మన జీవిత విధానంలో ఏ మార్పు ఉండదు నీవు అదేపద్మవి-నేను అదే మామయ్యవి. మన మధ్య అదే సంబంధబాంధవ్యం ఉంటుంది తల్లీ నా అనంతరం నీవు నీ వేషాన్ని కూడా మార్చనవసరం లేదు. ఈ రహస్యం ప్రస్తుతం మన ఆరుగురి మధ్య ఉంటుంది. ఆలోచించుకోమ్మా"

పద్మ ఒక రోజంతా ఆలోచించుకుంది ఆమె ఒకరి సలహా అడగలేదు. టీచరమ్మను అడిగితే "నీ ఇష్టం పద్మా"అంది.

చివరికి ఒప్పుకుంది. రిజిస్ట్రాఫీసులో సంతకాలు అయిన తరువాత ఇంటి కొచ్చారు. ముకుందరావు ఉలసటతో పడుకున్నాడు పద్మ ఎప్పటిలా తన పనుల్లో నిమగ్నమైంది. ఎప్పుడైన ఆ వృద్ధుడ్ని భర్త దృష్టితో చూచినా వెంటనే తన్ను తాను గద్దించుకుని మామూలు పద్మ అయిపోయేది.

తనను ఎవరు పెళ్ళాడతారు? ఒక మారు ఒళ్ళు చూచుకుంది. పెదిమల మీద-కాళ్ళమీద - చేతులమీద తెల్ల మచ్చలు। కొలు కుంటి।

ఈ జీవితమే ఒక నాటక రంగం.

తామిరువురు పాత్రధారులు-అంతే.

పదిహేను సంవత్సరాల తరువాత పండు వృద్ధాప్యంలో ఎనభై ఎనిమిదవ సంవత్సరం మామయ్య మృతిచెందాడు. తనకు నలభై ఎనిమిది సంవత్సరాలు।

ఈ గృహానికి వచ్చి ముప్పైమూడు సంవత్సరాలు।

* * *

"ఊ కానివ్వండి. నగలమాటేమిటి? అత్తగారివన్నీ చెల్లెలుగారు తీసుకున్నారా?" రెండవ కొడుకు ఎగతాళి చేస్తూ ఓ విషపునవ్వు నవ్వాడు.

"లేదు అవి మీ ఇద్దరికి చెరిసగం పంచుకోవాలని ఉంది. వినండి. పూర్తిగా చదువుతాను"

పద్మ వినటం లేదు గోడకు వ్రేలాడుతోన్న సూరమ్మ మామయ్యల ఫొటో వేపు చూస్తుండిపోయింది.